క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ



కారేపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

కారేపల్లి: మండలంలోని సర్వే నంబర్ 38లో గల ప్రభుత్వ స్థలాన్ని ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలం ఎంత ఖాళీగా ఉన్నదో సర్వే చేసి నివేదికలు పంపించాల్సిందిగా.. సింగరేణి తహసీల్దార్ శ్రీనివాసరావును ఆర్డీఓ ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా ఉన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సామినేని నర్సింహారావు, సర్వేయర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కొణిజర్ల: మండలంలోని రామనరసయ్యనగర్‌కు చెందిన నీలాల యేసుకు, మల్లుపల్లికి చెందిన సంపంగి కృష్ణలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన రూ.26,000, రూ.23,500 లకు సంబంధించిన చెక్కులను జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి దర్మసోత సౌందర్య శనివారం మల్లుపల్లిలో అందించారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరయినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, కోటేష్, రాము, అరుణ, సంధ్య, సోనీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లాడ మండలం మంగాపురం గ్రామానికి చెందిన అమర్లపూడి నాగేశ్వరరావు అనే దివ్యాంగుడికి శనివారం వీల్ చైర్ అందించారు. లయన్స్‌క్లబ్ వీడీజీ–2గా ఎన్నికైన నంబూరి మధును ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, జోన్ చైర్మన్ ప్రభాకర్‌రావు, శ్రీకాంత్, వరలక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిపై అవగాహన

మధిర: నాగవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల ప్రగతి గురించి ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. వెనుకబడిన విద్యార్థులకు చేస్తున్న ప్రత్యేక విద్యాబోధన తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగారావు, గ్రామ సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయలో ముగిసిన టాస్క్ శిక్షణ

కొణిజర్ల: మండలంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ నాలెడ్జ్ (టాస్క్) వారి ఆధ్వర్యంలో బీటెక్ సీఎస్ఈ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై గత మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా టాస్క్ రిసోర్స్ పర్సన్ హేమంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జాన్‌బాబులు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, సీఎస్‌సీ హెచ్ఓడీ సంధ్యారాణి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు రూరల్: ఐసీడీఎస్, బాలల పరిరక్షణ కమిటీ ద్వారా మండలంలోని కప్పలబంధంలో శనివారం బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలల పరిరక్షణ విభాగం జిల్లా సోషల్ వర్కర్ జె.అన్నపూర్ణ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. ఉపసర్పంచ్ మాధవరెడ్డి, ఏసీడీపీఓ రత్తమ్మ, సూపర్‌వైజర్ భవాని, హెచ్ఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో సామూహిక గృహ ప్రవేశాలు

కల్లూరు: కల్లూరులో నిరుపేదలకు మంజూరైన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లల్లో శనివారం లబ్ధిదారులు సామూహికంగా గృహ ప్రవేశాలు చేశారు. పట్టణంలో సాగర్ కెనాల్ పక్కన 96 డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించగా ఇటీవల లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీంతో వీరంతా గృహ ప్రవేశాలు చేశారు.

హలీమ్.. సలాం!

- సత్తుపల్లిలో తొలిసారి స్టాల్ ఏర్పాటు
- రుచితో పాటు పోషకాలు అదనం
- మాంసం ప్రియుల ఆనందం

సండే స్పెషల్

సత్తుపల్లి: రంజాన్ మాసం వస్తుందంటే హలీమ్ రుచులు చూడాల్సిందే.. ఒకప్పుడు హైద్రాబాద్, ఖమ్మం నగరాలకే పరిమితమైన హలీమ్ తొలిసారిగా సత్తుపల్లిలో పెట్టడం మాంసం ప్రియులు ఆనందాన్నిస్తోంది. ఘుమ ఘుమలాడే హలీమ్ రుచులను ఆస్వాదించడానికి స్థానికులు ఉత్సాహం చూపించారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద హలీమ్ వంటకం కోసం మండీని ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం నెల రోజులు మాత్రమే హలీమ్ వంటకం ఉంటుంది.



హలీమ్‌ను అందజేస్తున్న స్టాల్ నిర్వాహకులు



బాక్స్‌ల్లో సిద్ధంగా ఉన్న హలీమ్

ఈ వంటకం బహుకష్టమే..

హలీమ్ వంటకం సుమారు ఆరు గంటలు శ్రమిస్తేనే తయారౌతుంది. 50 కేజీల చికెన్ హలీమ్‌ను సత్తుపల్లిలో హైద్రాబాద్ నుంచి వచ్చిన వంటమాస్టార్లు సిద్ధం చేస్తున్నారు. 400 గ్రాముల హలీమ్‌ను రూ.100లకు విక్రయిస్తున్నారు. ముందుగా మండి బట్టిగిన్నెలో చికెన్‌ను తగు నీటిపాళ్లల్లో వేడిచేసి ఉడికిన తర్వాత లాల్‌మిర్చి, పసుపు, ఉప్పు కలిపి బయటకు తీస్తారు. తర్వాత మసాలా దినుసులన్నీ నీళ్లతో వేడిచేసి రవ్వను కలిపిన తర్వాత చివరిలో చికెన్‌ను కలిపి రెండు గంటల పాటు ఘోటా(సుత్తిలాంటి కర్రతో) రెండు గంటల పాటు శ్రయిస్తే పసందైన.. రుచికరమైన హలీమ్ తయారౌతుంది. దీని తయారీకి చికెన్, రవ్వ, షాజీరా తదితర పదార్థాలను వినియోగిస్తారు.

హలీమ్ రుచి అందించాలని..



సత్తుపల్లి ప్రాంతానికి హలీమ్ రుచి అందించాలని హైద్రాబాద్ నుంచి ప్రత్యేకంగా హలీమ్ వంట మాస్టార్లను తెప్పించాం. చికెన్ హలీమ్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఆర్డర్లు ఉంటే మటన్ హలీమ్‌ను కూడా తయారు చేస్తాం.

– ఎండి సోహెల్, సత్తుపల్లి

చాలా బాగుంది..



హలీమ్ తినాలంటే హైద్రాబాద్ నుంచి తెప్పించేవాళ్లం. సత్తుపల్లిలో హలీమ్ రుచి చాలా బాగుంది. రంజాన్ మాసం హలీమ్ రుచి చూస్తే ఉపవాస బడలిక కూడా తీరుతుంది. ఇక్కడ తయారు చేసిన హలీమ్ చాలా రుచికరంగా ఉంది.

– ఎస్‌కే. బాజీ, కొమ్మేపల్లి

రైతుల పక్షపాతి.. బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- 'ఆత్మ'చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వనమా వాసు



ఆత్మ చైర్మన్ వాసును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

సత్తుపల్లి: రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ అన్నదాతల పక్షపాతిగా నిలుస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. నియోజకవర్గంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతోనే ఆత్మ కమిటీ చైర్మన్‌గా వనమా వాసును ఎంపిక చేశామని తెలిపారు. కొత్తూరులోని రైతువేదికలో శనివారం ఆత్మకమిటీ చైర్మన్‌గా వనమా వాసుతో ఏడీఏ నర్సింహారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ఎలా నిర్వీర్యం చేశారో అందరికీ తెలుసునని చెప్పారు. కానీ తెలంగాణ ఏర్పడి సీఎం కేసీఆర్ అధికారం చేపట్టాక వ్యవసాయంలో సంస్కరణలు తీసుకొచ్చి రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని తెలిపారు. మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, ప్రాజెక్టులు, నిరంతర విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండుగ చేశారని చెప్పారు. కాగా, ఆర్యవైశ్యులకు రాజకీయంగా గుర్తించి ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్ ఒగ్గు విజయలక్ష్మితో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మిద్దె శ్రీను, కొత్తూరు ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి పురుషోత్తం, వినుకొండ వెంకట్రామయ్య, వంతంగి సాంబశివరావు, జిన్ని పాల్గొన్నారు.

మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన

కారేపల్లి/ఏన్కూరు: వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శనివారం కారేపల్లి, ఏన్కూరు మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో కొత్తూరు తండా, జన్నారం, తూతకలింగన్నపేట, ఏన్కూరు, సూర్యతండా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పలువురి వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మాలోత్ శకుంతల, నాయకులు పెద్దబోయిన ఉమాశంకర్, మొగిలి ఆదినారాయణ, బానోత్ కుమార్, మాలోత్ కిషోర్, బానోత్ రమేష్, పర్సా పట్టాభిరామారావు, బానోత్ సురేష్‌నాయక్, భూక్య లాలు, భూక్యా కాంతి, కృష్ణప్రియ, శ్రీకాంత్, పద్మ, బాలాజీ పాల్గొన్నారు.

అమెరికాలో మెడికల్ పీజీ సీటు సాధించిన సుజిత్



సుజిత్

మధిర: మధిరకు చెందిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మనవడు, డాక్టర్ సతీష్ – డాక్టర్ శ్రీదేవి కుమారుడు డాక్టర్ సుజిత్ అమెరికాలో పీజీ మెడికల్ సీట్ సాధించాడు. మణిపాల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన అమెరికాలోని డౌన్ స్టేట్ మెడికల్ సెంట్రల్ యూనివర్సిటీ హాస్పిటల్ బ్రూక్లిన్‌లో న్యూరాలజీ విభాగంలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా సుజిత్‌నువివిధ పార్టీల నాయకులు, వైద్యులు శనివారం అభినందించారు.

ప్రశ్నించినందుకే తప్పుడు ఆరోపణలు..

మధిర: ఇసుక మాఫియా ఆగడాలను ప్రశ్నిస్తూ, అడ్డుకున్నందుకే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాపై అధికారులను వినతిపత్రాలు ఇవ్వడమే కాక లారీలను అడ్డుకున్నామని చెప్పారు. దీంతో మాఫియాకు వత్తాసు పలుకుతున్న టౌన్ ఎస్సై, తదితర అధికారులు తనపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ, మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మర్సకట్ల స్వర్ణాకర్, అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు..

ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి..

చింతకాని: మండలంలోని పాతర్లపాడులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణహామీ పథకం నిధులు రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి శనివారం స్థలదాత కుటుంబసభ్యులు రాంకిషన్‌రావు, హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కేంద్రానికి అవసరమైన 4 కుంటల స్థలాన్ని గ్రామానికి చెందిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కేశరాజు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్యాంసుందర్‌రావు, కోడలు వాణి వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పిచ్చయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ ప్రసాద్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి..

ముదిగొండ: మండలంలోని మాధాపురం గ్రామంలో నూతనంగా శ్రీకంఠమహేశ్వరస్వామి, సురాంభాదేవిల ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణేష్ పూజలు, వాస్తు పూజలు, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వీకరించారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరారూరల్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం మాటల భరోసా కంటే ఆర్థిక భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో నష్టపోయిన పంటలను రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి ప్రకృతి వైపరీత్యాల వలన జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, ధర్మారావు, రాంబాబు, వెంపటి రాజు, గోవర్ధన్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే సంక్షేమం

పెనుబల్లి : ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. 19వ రోజు శనివారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని సూరయ్య బంజర, సూరయ్య బంజర్ తండా, గణేష్‌పాడు, ముత్తగూడెం గ్రామాల్లో ప్రజలతో కలిసి గడప, గడపకు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ రాహుల్ గాంధీ సందేశ పత్రాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆస్తులను కూడబెట్టుకునే పనిలో పడి ప్రజా సంక్షేమాన్ని మరిచారన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెలికాని రాజబాబు, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, కాంతయ్య, కమలాకర్, హరిబాబు, వెంకటేశ్వర్లు, శ్రీను, దేవేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి: గ్యాస్ సిలిండర్లను చూపుతున్న సంభాని, గ్రామస్తులు

నేటి నుంచి హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం..

కల్లూరు రూరల్: మండలంలో నేటినుండి హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించనున్నట్లు కల్లూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ తెలిపారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని లోకవరం, పడమరలోకవరం, పాయపూరు, హనుమతండా గ్రామ పంచాయతీలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్రరెడ్డి

తల్లాడ: తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ దొడ్డా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల పరిషత్ నిధుల ద్వారా రూ.37లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. ఈ సందర్భంగా 16 ఎంపీటీసీల పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమత్తం ప్రతిపాదనలు కోరారు. ఒకసారి ఇచ్చిన పనిని తిరిగి మార్చుకొనే వీలే లేదని ఎంపీడీఓ రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ మాట్లాడుతూ.. మల్లవరం, అన్నారుగూడెం, నిమ్మగూడెం పాఠశాలలు జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాలలుగా ఎంపికైనట్లు తెలిపారు. ఎన్ఎన్ఎంఎస్ ద్వారా మండలంలో ముగ్గురు విద్యార్థులకు స్కాలర్ షిప్ మంజూరైనట్లు పేర్కొన్నారు. మండల వైద్యాధికారి రత్నమనోహర్ మాట్లాడుతూ.. మండలంలో 27 పంచాయతీలకు గాను కంటి వెలుగు కార్యక్రమం కింద 12 పంచాయతీల్లో 10,451 మందికి పరీక్షలు నిర్వహించి 2,487 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. తల్లాడ గ్రామ పంచాయతీ ఇండోర్ స్టేడియం నిర్మించాలని కలకొడిమ ఎంపీటీసీ ఆదూరి వెంకటేశ్వర్లు తీర్మానం ప్రవేశ పెట్టగా సమావేశం ఏక గ్రీవంగా ఆమోదించింది. తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, చల్లా తిరమలాదేవి, రావూరి పద్మ, మోహన్, రుద్రాక్ష బ్రహ్మం, వేమిరెడ్డి తులిశమ్మ, గోవింద్ విజయమ్మ, రేంజర్ అరవింద్, ఈఓ ఉషా, తల్లాడ సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు



మధిర: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు

మధిర: మున్సిపాలిటీ అభివృద్ధికి ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.30కోట్ల నిధులతో నిధులతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు ఇల్లెందులపాడులో శనివారం ఆయన గుడ్ మార్నింగ్ మధిర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో కూడా ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అదే విధంగా సమీకృత మార్కెట్, ట్యాంక్‌బండ్, 100 పడకల ఆస్పత్రి తదితర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కాగా, నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు సహకరించిన మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు, మల్లాది సవిత, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలో పర్యటన..

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పర్యటించారు. చొప్పకట్లపాలెంకు చెందిన యరమల యజ్ఞితారెడ్డి ప్రపంచ కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంతో ఆమెను సన్మానించగా, మీనవోలు, అయ్యవారిగూడెం, సఖినవీడుల్లో జరిగిన కార్యక్రమాలకు కూడా హాజరయ్యారు. మధిర మార్కెట్ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, నాయకులు సాంబశివరావు, అప్పారావు, వెంకటనారాయణ, వెంకటేశ్వరరావు, పురుషోత్తంరాజు, కృష్ణారెడ్డి, కృష్ణారావు, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ శిరీష

ఏన్కూరు: పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ శిరీష కోరారు. మండలంలోని జన్నారం, గార్లఒడ్డు, హిమామ్‌నగర్‌లో రోడ్డు పక్కన నాటిన మొక్కలను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రాజు, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా ముత్యాల తలంబ్రాలు



రశీదు పొందుతున్న ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ముత్యాల తలంబ్రాలు కేవలం రూ.116లకే ఇంటి వద్దకు ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా సరఫరా చేయబడుతుందని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం సత్తుపల్లి డిపోలో ముత్యాల తలంబ్రాల కోసం రూ.116లు చెల్లించి ఆమె రశీదును పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండి సజ్జన్నార్ ప్రత్యేక చొరవ తీసుకొని భద్రాచలం శ్రీరామ నవమికి వెళ్లలేని వారి కోసం ఆర్టీసీ ద్వారా ఈ సదుపాయం కల్పించారన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మునీర్‌పాషా, బాబురావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

గార్లఒడ్డు ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న జీవన్‌లాల్

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఇన్‌కంటాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలికిన అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరావు, సురేష్ నాయక్, లాలు, కాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఎర్రుపాలెం: మండలంలోని రామాపురం గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రధాన అర్చకులు యోగేంద్ర చారి ప్రతిష్ఠించారు. గ్రామ సర్పంచ్ కొమ్మూరి గోపాలరావు దంపతులు, చెరుకుమల్లి ప్రసాదరావు దంపతులుతో చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పంచపాండవుల విగ్రహ ప్రతిష్ఠ..

కారేపల్లి: కారేపల్లి శ్రీపెద్దమ్మతల్లి ఆలయ సత్రం సమీపంలో పంచపాండవుల గుడిలో నూతనంగా పంచపాండవుల విగ్రహ రూపాలను గ్రామ ప్రజలు శనివారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాంబాబు, నారాయణ, రవి, సాంబ, పెద్దమ్మ సత్యం, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం

ఏన్కూరు: మండల కేంద్రంలో అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, దీక్షాదారణ, ఆరాధన తదితర హోమలు నిర్వహించారు. స్వామి శాంతి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్ అచార్యులు, కిషోర్ ఆచార్యులు, శివాలయం కమిటీ సభ్యులు నాగేశ్వరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండించండి

సత్తుపల్లిరూరల్: దేశంలో క్రైస్తవులపై దాడులు ఎక్కువ అవుతున్నాయని ఎన్‌సీసీ జాతీయ కో–ఆర్డినేటర్ బిషప్ జేమ్స్‌చాకో ఆందోళన వ్యక్తం చేశారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని కొన్ని వేల సంస్థల ఎఫ్‌సీఆర్‌ఏలు రద్దు చేశారని.. ఎటువంటి ఆర్థిక సాయం లేకుండా అనేక మంది పాస్టర్ల పొట్ట కొట్టారన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రేయర్‌వింగ్ ఉపాధ్యక్షుడు వినోయ్‌జోసెఫ్, జార్జ్‌చాకో, జేమ్స్, నిరీక్షణరావు, బాలస్వామి, ప్రసాదరావు, శ్రీనివాస్, జాన్‌మార్క్ పాల్గొన్నారు.

ఒలంపియార్డ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: రాష్ట్ర స్థాయిలో జరిగిన ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌ల్లో సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎండీ హర్షియా, టాలెంట్ స్కూల్ విద్యార్థి తన్మయి ప్రతిభ చూపారు. వీరిని ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా జడ్జి పి.శ్రీనివాసరావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అండర్ పాస్ ఇవ్వాలని రైతులు ఆందోళన

ముదిగొండ: ముదిగొండ – సువర్ణాపురం రహదారి మూసివేయొద్దని, అండర్ పాస్ ఇవ్వాలని ముదిగొండ, సువర్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. రహదారి మూసివేత పనులను చేపట్టొద్దన్నారు. నేషనల్ హైవే సిబ్బంది రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

యూనిట్లు పెంచండి

బోనకల్: మైనార్టీ కార్పొరేషన్ యూనిట్లు పెంచాలని కోరుతూ మండలంలోని మైనార్టీలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖమ్మం – బోనకల్ ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. కేవలం 3యూనిట్లకు 198 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అధికారులు లాటరీ పద్ధతిన డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామనడం సబబు కాదన్నారు. ఎంపీడీఓ వేణుమాధవ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్రైం కార్నర్

ట్రాలీ ఆటో బోల్తా, కూలీలకు గాయాలు

పెనుబల్లి : అతివేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరు జిల్లాకు చెందిన 11 మంది కూలీలు తల్లాడ మండలం అంజనాపురంలో చెరుకు కోతకు వచ్చి శనివారం సాయంత్రం బయలుదేరారు. అప్పటికే వర్షం పడుతుండగా సత్తుపల్లి వైపు వెళ్తున్న ట్రాలీ ఆటోలో ఎక్కగా, అతివేగంగా వెళ్తున్న డ్రైవర్ మండలంలోని టేకులపల్లిలోని రాజస్థాన్ దాబా వద్ద మరో వాహనాన్ని దాటే క్రమాన బోల్తా పడింది. ఘటనలో ఆరుగురు కూలీలకు గాయాలు కాగా పెనుబల్లి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వీఎం బంజర్ ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

కల్లూరులో ప్రమాదం..

కల్లూరు: మండలంలోని పేరువంచ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. తల్లాడ మండలం పినపాకకు చెందిన చిలుకూరు ప్రశాంత్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తూ ద్విచక్ర వాహనంపై పేరువంచలోకి బంధువుల ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో తిరువూరు నుంచి కల్లూరు వైపు వస్తున్న కారు ఢీకొట్టగా ప్రశాంత్ గాయపడడంతో కల్లూరులో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.